
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం ၊ 4 ၊ జనవరి ၊ 2024



సోమశిలలో 33.38 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 33.388 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 31 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.65 వేలు
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,837
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,012
సవర (8 గ్రాములు)	రూ.48,096

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.4 /24.0

బుధవారం గాలిలో తేమ 49 శాతం ఉంది. ఉష్ణోగ్రత తక్కువగానే ఉంటోంది. గురువారం మార్పులేవీ ఉండకపోవచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- కమిషనర్ వికాస్ మర్మత్



ఎన్నికల విభాగాధికారులతో సమీక్షిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. మంచినీటి సదుపాయం, పారిశుధ్యం, మరుగుదొడ్ల ఏర్పాటు, బ్యారికేడ్ల నిర్మాణం, మార్గనిర్దేశక సూచికలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక వీల్‌చైర్లు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేసేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు భద్రత చర్యలు చేపట్టాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, ఇంటర్నెట్, టెలిఫోన్ సదుపాయాలను పరిశీలించాలని సూచించారు.

250 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

ఆత్మకూరు: రేషన్ బియ్యం కొన్ని చోట్ల పక్కదారి పడుతుండటంతో విజిలెన్స్ అధికారులు ముమ్మర తనిఖీలను నిర్వహిస్తున్నారు. మండలంలోని మహిమలూరులో విజిలెన్స్ అధికారులు తనిఖీలను బుధవారం నిర్వహించారు. పలు ఎండీయూ వాహనాల వద్ద కొనుగోలు చేసిన 250 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన చంద్రయ్య సదరు బియ్యాన్ని ఐదు బస్తాల్లో ఓ గదిలో దాచి ఉంచగా గుర్తించి పట్టుకున్నామన్నారు. విజిలెన్స్ అధికారుల ఆదేశాల మేరకు చంద్రయ్యపై డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెత్త ఎత్తి.. పరిసరాలను శుభ్రం చేసి

- పారిశుధ్య కార్మికుడి అవతారమెత్తిన కార్పొరేటర్



చెత్తను తొలగిస్తున్న శ్రీనివాసయాదవ్

నెల్లూరు(బారకాసు): మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో నగరంలోని అనేక ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయింది. ఈ నేపథ్యంలో నగరంలోని 37వ డివిజన్ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ పారిశుధ్య కార్మికుడి అవతారమెత్తారు. సదరు డివిజన్లోని వీధుల్లో పేరుకుపోయిన చెత్తను బుట్టలో వేసుకొని ట్రాక్టర్‌లో వేసి అక్కడి పరిసరాలు పరిశుభ్రంగా మారేలా చర్యలు చేపట్టారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రైవేట్ కార్మికులతో పరిసరాలను పరిశుభ్రం చేసే ప్రక్రియను ప్రారంభించారు. కాగా కార్పొరేటర్ చేస్తున్న పనిని అడ్డుకునేందుకు సమ్మె చేస్తున్న కార్మికులు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు అక్కడికి చేరుకొని చెత్త తొలగింపు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు.

మద్యం మత్తులో కారుతో బీభత్సం

కావలి: మద్యం మత్తులో కారు నడుపుతూ పట్టణంలోని ట్రంక్‌రోడ్డులో గందరగోళం సృష్టించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. మద్దూరుపాడుకు చెందిన శంకర్ మద్యం మత్తులో కారు నడుపుతూ పట్టణంలోని ట్రంక్‌రోడ్డులో ఒక పాదచారుడ్ని ఢీకొన్నారు. దీంతో పాదచారుడు గాయపడ్డారు. ప్రశ్నించిన స్థానికులు, పోలీసులపై శంకర్ దాడికి దిగడంతో గందరగోళం నెలకొంది. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. కాగా శంకర్ గతంలో టీడీపీ నేత మలిశెట్టి వెంకటేశ్వర్లు అనుచరుడిగా, ప్రస్తుతం పసుపులేటి సుధాకర్ అనుచరుడిగా ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. శంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేపట్టారు.

కాదేదీ అక్రమాలకు అనర్హం

గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా కుంభకోణాలు

- ప్రజా సొమ్మును స్వాహా చేసిన టీడీపీ నేతలు
- తాము చేసిన అక్రమాలను కప్పేసి ప్రస్తుత ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు
- ఎన్నికల్లో లబ్ధి కోసం దుష్ప్రచారం



▲ఉదయగిరి నియోజకవర్గంలోని వంకపై గత టీడీపీ హయాంలో నిర్మించిన ఫైబర్ చెక్ డ్యామ్ దుస్థితి (ఫైల్)

అక్రమాలకు కాదేదీ అనర్హమంటూ గత టీడీపీ హయాంలో ఆ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు బరితెగించారు. కోట్లు స్వాహా చేసి ప్రజాధనాన్ని యథేచ్ఛగా కొల్లగొట్టిన పాపంలో నాటి మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు సూత్రధారులని తెలిసినా, చంద్రబాబు మౌనం దాల్చారు. అవినీతి, అక్రమాల్లో మునిగితేలిన ఆ పార్టీ ప్రస్తుతం వింత నాటకానికి శ్రీకారం చుట్టింది. పారదర్శకంగా పాలన సాగిస్తున్న ప్రస్తుత ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు, దుష్ప్రచారంతో నానా యాగీ చేస్తున్న ఆ పార్టీకి పచ్చమీడియా తోడైంది.

ఉదయగిరి: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అవినీతి, అక్రమాలు, అరాచకాలకు కేరాఫ్‌గా నిలిచింది. ప్రకృతి వనరులను కొల్లగొట్టడం మొదలుకొని.. అత్యంత నాసిరకంగా పనులు చేసి ప్రజాధనాన్ని యథేచ్ఛగా స్వాహా చేశారు. ఆ సమయంలో జిల్లాలో వెలుగుచూసిన ప్రతి కుంభకోణం వెనుకా పచ్చనేతలే ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

సీఎమ్మార్ బియ్యం సరఫరాలో భారీ అవినీతి

మిల్లర్లు అప్పటి ప్రభుత్వంలోని అధికారులతో కుమ్మక్కై సీఎమ్మార్ బియ్యం సరఫరా విషయంలో భారీ అవినీతికి పాల్పడ్డారు. 2015 – 16లో ప్రభుత్వం 3.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. సీఎమ్మార్ కోసం మిల్లర్లకు ధాన్యాన్ని సరఫరా చేసింది. వారు తిరిగి 2.16 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా, 1.97 లక్షల మెట్రిక్ టన్నులనే ఇచ్చారు. మిగిలిన బియ్యం కోసం రూ.36 కోట్ల బకాయి పడ్డారు. ఈ సొమ్ము స్వాహా వెనుక నాటి ప్రభుత్వ పెద్దలున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో 37 మంది మిల్లర్లపై నామమాత్రపు కేసులు పెట్టారు. దీనికి సంబంధించి పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిపించి రికార్డులు కాలిపోయేలా చేశారు.

ధాన్యం రవాణా చార్జీల్లోనూ కుంభకోణం

ధాన్యం రవాణా చార్జీల్లో కుంభకోణం 2018 నుంచి ప్రారంభమైంది. అప్పటి పౌరసరఫరాల సంస్థ డీఎంగా ఉన్న రోజ్‌మాండ్ ధాన్యం రవాణా చార్జీలను పక్కదారి పట్టించారని విచారణలో తేలింది. ఈ కుంభకోణంలో రూ.40 కోట్లు స్వాహా చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ అంశంలో విచారణ జరిపి దీని వెనుక ఉన్న 20 మందిని జైలుకు పంపారు.

ప్రభుత్వంపై ఎల్లో గ్యాంగ్ దుష్ప్రచారం

తాము అధికారంలో ఉన్న ఐదేళ్లలో అంతులేని అవినీతికి పాల్పడిన టీడీపీ నేతలు వాటిని మర్చిపోయి పారదర్శకంగా పాలన సాగిస్తున్న ప్రస్తుత ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. టీడీపీ హయాంలో కోట్లలో కుంభకోణాలు జరిగినా వెలుగులోకి తేని పచ్చమీడియా ఇప్పుడు ఎలాంటి అక్రమాలు, అవినీతి లేకపోయినా నానా యాగీ చేస్తూ ప్రజలను నమ్మించే యత్నం చేస్తోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి పనికీ వక్రభాష్యాలు పలుకుతోంది.

జిల్లాలో ఇదీ అక్రమాల చిట్టా..

- ఉదయగిరిలో పసుపు కుంభకోణం వెనుక స్థానిక టీడీపీ నేతలున్నారు. వీరు దాదాపు రూ.30 కోట్ల మేర స్వాహా చేశారు. ఈ వ్యవహారంలో పలువురు అధికారులు, టీడీపీ నేతలు అరెస్టయ్యారు.
- టీడీపీ ఐదేళ్ల పాలనలో ఉపాధి హామీ పథకంలో సుమారు రూ.14 కోట్లను తెలుగు తమ్ముళ్లు పక్కదారి పట్టించారనే అంశాన్ని సామాజిక తనిఖీలో నిగ్గుతేల్చారు.
- నీరు–చెట్టు పథకంలో చేపట్టిన పనుల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. జిల్లావ్యాప్తంగా సుమారు రూ.200 కోట్ల వరకు అక్రమాలు జరిగాయనే అంశం విజిలెన్స్ విచారణలో బహిర్గతమైంది. ఒక్క ఉదయగిరి నియోజకవర్గంలోనే ఫైబర్ చెక్ డ్యామ్‌ల పేరుతో రూ.80 కోట్ల వరకు స్వాహా చేశారని గుర్తించారు.
- దామవరం విమానాశ్రయ భూసేకరణలోనూ భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూముల్లో పచ్చనేతలు బినామీ పేర్లు నమోదు చేయించుకొని పరిహారాన్ని బొక్కేశారు. అప్పటి కలెక్టర్ ఈ వ్యవహారంపై విచారణ జరిపి పలువురు అధికారులపై చర్యలు చేపట్టారు.
- పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ భూ సేకరణలోనూ టీడీపీ నేతలు అక్రమాలకు పాల్పడి పెద్ద మొత్తంలో స్వాహా చేశారు.
- దగదర్తి మండలంలో సుమారు రూ.100 కోట్ల విలువజేసే సహజ వనరులను టీడీపీ నేతలు కొల్లగొట్టారు.
- కలువాయి మండలం పేరంకొండ భూ పంపిణీ పరిహారంలో రూ.కోట్లలో టీడీపీ నేతలు కుంభకోణానికి పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి.
- రైతు రథంలో కమీషన్ల మొదలుకొని ప్రతి కుంభకోణం టీడీపీ హయాంలో జరిగిందనే విషయాలను జిల్లా ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న వాణి

నెల్లూరు రూరల్: లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. వేదాయపాళెంలోని రిచ్ నర్సింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నిరక్షరాస్యులకు తమ సంస్థ ద్వారా న్యాయసేవలను ఉచితంగా అందిస్తామని తెలిపారు.

9 నుంచి అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వారోత్సవాలు

నెల్లూరు (టౌన్): విజయవాడలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకొని ఈ నెల తొమ్మిది నుంచి 18 వరకు వారోత్సవాలను నిర్వహించనున్నామని డీఈఓ గంగాభవాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖన, వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలను మండల స్థాయిలో ఈ నెల 8న, జిల్లా స్థాయిలో 11న నిర్వహించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

- అంబేడ్కర్.. సాంఘిక న్యాయం అనే అంశంపై నగరంలోని డీకేడబ్ల్యూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయిలో 11న వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. 12 నుంచి 15 ఏళ్ల వయస్సు గల విద్యార్థులకు ఉదయం పది గంటలకు.. 16 నుంచి 18 ఏళ్ల వయస్సు గల విద్యార్థులకు మధ్యాహ్నం రెండు గంటలకు పోటీలను నిర్వహించనున్నామని వివరించారు. విజేతలకు వరుసగా రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేల నగదు పురస్కారాలను అందజేయనున్నామని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాలనుకునే వారు ఈ నెల 11న గంట ముందుగానే వారి ఆధార్ కార్డు, ఇతర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

హాల్‌టికెట్లు ఇవ్వలేదంటూ పోలీస్‌స్టేషన్‌కు..



ఆవేదన వ్యక్తం చేస్తున్న మల్లేశ్వరి, శిరీష

కందుకూరు రూరల్: హాల్‌టికెట్లు ఇవ్వకపోవడంతో నర్సింగ్ పరీక్షకు హాజరుకాలేకపోతున్నామంటూ కందుకూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌ను విద్యార్థినులు ఆశ్రయించారు. వారి వివరాల మేరకు.. కందుకూరులోని కాళిదాసువారి వీధిలో గల జీకే రెడ్డి స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో జీఎన్ఎం, ఏఎన్ఎం కోర్సులకు విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఈ ఏడాది పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్ల కోసం కందుకూరుకు చెందిన మల్లేశ్వరి, పాలూరుకు చెందిన శిరీష, మరో పది మందికిపైగా కళాశాలకు బుధవారం వెళ్లారు. అయితే ఫీజులు చెల్లిస్తేనే హాల్‌టికెట్ ఇస్తామని ప్రిన్సిపల్ చెప్పారు. ఇదే విషయమై రెండు రోజుల నుంచి తిప్పుకొన్నారని విద్యార్థినులు ఆరోపించారు. ఒంగోలులోని జీజీహెచ్‌లో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పరీక్ష ఉందని, చివరికి పరీక్షకు హాజరుకానీయకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడో సంవత్సర పరీక్షను సప్లిమెంటరీలో రాస్తే తన భవిష్యత్తు ఏమిటని మల్లేశ్వరి విలపించారు. విద్యార్థినులు ఫిర్యాదు చేశారని, ఈ అంశమై కళాశాల వారితో మాట్లాడామని పట్టణ ఎస్సై హనీఫ్ తెలిపారు.

తెలుగు మహాసభలకు సంఘీభావంగా..

నెల్లూరు(బృందావనం): రాజమహేంద్రవరంలో ఈ నెల ఐదు నుంచి ఏడు వరకు నిర్వహించనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభలకు సంఘీభావంగా నగరంలోని భక్తవత్సలనగర్‌లో తెలుగు భాషా వైభవ శోభాయాత్రను బుధవారం నిర్వహించారు. భక్తవత్సలనగర్‌లోని సంఘమిత్ర హైస్కూల్ నుంచి మినీబైపాస్ రోడ్డులోని సాయిబాబా మందిరం వరకు సాగింది. తెలుగుభాష విశిష్టతను వివరిస్తూ నినాదాలు చేశారు. ఇందుకూరుపేటలోని లలితామహేశ్వరి పీఠాధిపతి రామాయణం మహేష్‌స్వామి, సమన్వయ సంఘ జిల్లా అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, బలరామయ్యనాయుడు, రమేష్, పారా శ్రీధర్‌శర్మ, భవానీప్రసాద్ రావు, మైపాడు రాజా, మదన్‌మోహన్, అలూరు శిరోమణిశర్మ, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం

- కలెక్టర్ హరినారాయణన్
- ఎమ్మెల్యే ప్రసన్నతో కలిసి సీహెచ్‌సీ ప్రారంభం



సీహెచ్‌సీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పేదల జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యంగా విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో రూ.3.15 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించిన 30 పడకల సీహెచ్‌సీని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకొచ్చిందని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వాస్పత్రుల్లో సిబ్బందిని ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నామని వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అందుబాటులో అత్యాధునిక వైద్యసేవలు

పేదలకు అత్యాధునిక వైద్యసేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చిస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సీహెచ్‌సీలో మేల్.. ఫీమేల్.. ఐసొలేషన్ వార్డులు, పీడియాట్రిక్, ఆపరేషన్ థియేటర్, కాజ్యువాల్టీ, ఈసీజీ, బ్లడ్ టెస్టింగ్ తదితర అత్యాధునిక సౌకర్యాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సీహెచ్‌సీలో అసంపూర్తిగా ఉన్న మరో భవన నిర్మాణానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.పది లక్షలను మంజూరు చేశారని వివరించారు. ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు రూ.25 లక్షల సీఎస్సార్ నిధులను మంజూరు చేయిస్తానని కలెక్టర్ హామీ ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేశారు.

పీహెచ్‌సీల ఆధునికీకరణ

జొన్నవాడ, ఇనమడుగు, యల్లాయపాళెం, విడవలూరు, రామతీర్థం పీహెచ్‌సీల ఆధునికీకరణ పనులను రూ.2.9 కోట్లతో చేస్తామన్నారు. మైపాడులో రూ.1.54 కోట్లతో ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి టెండర్లు పిలిచామని, పనులను త్వరలో ప్రారంభించనున్నామని వెల్లడించారు. విడవలూరులో రూ.50 లక్షలతో న్యూ పబ్లిక్ హెల్త్ యూనిట్ బ్లాక్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ, ఏపీఎంఐడీసీ ఈఈ సుధాకర్, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రూరల్, టౌన్ కన్వీనర్లు సతీష్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, మెడికల్ ఆఫీసర్ పద్మజ పాల్గొన్నారు.



మర్రిపాడులో పెన్షన్‌ను పంపిణీ చేస్తున్న ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



పింఛన్ కానుకను అందజేస్తున్న నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్



వృద్ధురాలికి పింఛన్‌ను అందజేస్తున్న కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎంపీ బీద మస్తాన్‌రావు

ముసలి మోము మురిసింది



గత ప్రభుత్వ హయాంలో పింఛన్ పొందాలంటే అధికారుల చుట్టూ ప్రదక్షిణలు.. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సిఫార్సులు తప్పనిసరయ్యేది. ఫలితంగా అర్హులకు పింఛన్ అందని ద్రాక్షగా మారేది. ఈ క్రమంలో 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక అవ్వాతాతల మోముల్లో ఆనందం నెలకొంది. ఇచ్చిన హామీ మేరకు ఏటా రూ.250 చొప్పున పింఛన్‌ను పెంచుతూ వచ్చిన ప్రభుత్వం తాజాగా ఈ మొత్తాన్ని రూ.మూడు వేలకు తీసుకొచ్చింది. పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడలో బుధవారం శ్రీకారం చుట్టారు.

రూ.మూడు వేల పెన్షన్‌తో అవ్వాతాతల సంతోషం

- జిల్లాలో 3,19,952 మందికి వైఎస్సార్ పింఛన్ కానుక
- ప్రతి నెలా రూ.95.98 కోట్ల సాయం

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ పింఛన్ కానుక రూ.మూడు వేల పంపిణీ కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాల మైదానంలో కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. నెల్లూరులోని కలెక్టరేట్లో గల తిక్కన ప్రాంగణంలో పింఛన్ పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ హరినారాయణన్, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి తదితరులు హాజరయ్యారు. పింఛన్లను లబ్ధిదారులకు అందజేసిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 3,19,952 మంది వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.95.98 కోట్ల మేర సాయాన్ని అందజేస్తున్నామని పేర్కొన్నారు. నవరత్నాల ద్వారా పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. ఎలాంటి ఆసరా లేని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఆరోగ్య పరిస్థితి బాగోలేని వారు తదితరులకు పింఛన్ కానుకను అందజేస్తూ వారికి ఆర్థిక భరోసా కల్పిస్తోందని చెప్పారు. ఆయా మండలాల్లో నిర్దేశించిన షెడ్యూల్ మేరకు పింఛన్లను ఈ నెల 8లోపు అందజేయనున్నామని వెల్లడించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్‌ను పంపిణీ చేస్తున్నామని, కార్యక్రమం సజావుగా జరిగేలా కృషి చేస్తున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందికి అభినందనలను తెలియజేశారు.



పింఛన్ నగదు, మంజూరు పత్రాన్ని లబ్ధిదారుడికి అందజేస్తున్న కలెక్టర్ హరినారాయణన్


పింఛన్ ఎంతో ఆసరాగా నిలుస్తోంది



నాకు అందుతున్న వృద్ధాప్య పింఛన్ ఎంతో ఆసరాగా నిలుస్తోంది. గతంలో పింఛన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల ఎదుట పడిగాపులు కాయాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితే లేదు. జగనన్న సీఎం అయ్యాక ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారులు ఉన్న ప్రాంతానికే వలంటీర్లు వచ్చి పింఛన్‌ను అందజేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.మూడు వేల పింఛన్‌ను అందజేస్తున్న సీఎంకు కృతజ్ఞతలు.

– చెరుకూరు కృష్ణయ్య, మూలాపేట, నెల్లూరు

కుటుంబ పెద్దలా అండగా జగనన్న



వితంతు పింఛన్‌ను పొందుతున్నా. ఈ మొత్తం కుటుంబపోషణకు ఎంతో దోహదపడుతోంది. పింఛన్ మొత్తాన్ని రూ.మూడు వేలకు పెంచి అందజేయడంతో ఎంతో ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకే వచ్చి పింఛన్‌ను వలంటీర్ అందిస్తున్నారు. కుటుంబ పెద్దలా అండగా నిలుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– పొన్నూరు బుజ్జమ్మ, కాపువీధి, నెల్లూరు

6న నెల్లూరులో హాకీ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా జూనియర్ బాలుర హాకీ జట్ల ఎంపికలు ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి హాకీ మైదానంలో జరుగుతాయని హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.ప్రణయ్ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు ఈనెల 9వ తేదీన తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఇతర వివరాలకు 94404 66189 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి...

1. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో 12.12.2023 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు చేసిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించింది, తదనుగుణంగా ప్రభుత్వం G.O లను జారీ చేసింది మరియు అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు మరియు నిర్వహణ ఛార్జీలు విడుదల చెయ్యడం జరిగింది.

a) అంగన్ వాడీ హెల్పర్‌ను అంగన్ వాడీ వర్కర్‌గా పదోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ 20.12.2023 తేదీన జి.ఓ.ఎం.ఎస్.నెం.44 జారీ చేయబడింది.

b) అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు ఒకసారి TA/DA మరియు అంగన్‌వాడీ హెల్పర్‌లకు ద్వైమాసిక TA/DA క్లెయిమ్ చేయడానికి మెమో నం.2303564/ 2023/ PROG-I-A1, dt.20.12.2023 జారీ చేయబడింది. ఈ ఆదేశాలు జారీ చేసిన తేదీ నుంచి అమలులోకి వస్తాయి.

c) అంగన్‌వాడీ వర్కర్లు & హెల్పర్‌ల కొనసాగింపుకు గరిష్ట వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించి, సేవా ముగింపు ప్రయోజనం రూ.1,00,000/- మరియు రూ.40,000 అందించడానికి జి.ఓ.ఎం.ఎస్.నెం. 47, తేదీ 20.12.2023 జారీ చేయబడింది.

d) అద్దెలు (Rs66.54 Crs), పరిపాలనా ఖర్చులు (నీరు & విద్యుత్ ఛార్జీలు, చీపుర్లు, ఫినాయిల్ మొదలైనవి) (Rs.7.81 Crs) మరియు AWCల నిర్వహణ (చిన్న మరమ్మతులు) (రూ.6.36 Crs) కోసం బడ్జెట్‌లు విడుదల చేయబడ్డాయి.

2. అంతేకాకుండా 2019 నుండి

a) అంగన్ వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500/- లకు, మినీ అంగన్ వాడీ జీతాలను రూ.7,000/- కు, అంగన్‌వాడీ హెల్పర్ల జీతాలను రూ.7,000/- కు పెంచింది.

b) 2013 నుంచి అంగన్‌వాడీల కార్యకర్తలకు, సూపర్వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్- 2 సూపర్ వైజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగింది.

c) ఇదే సందర్భంలో ఈ సూపర్వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించడం జరిగింది.

d) అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డిబిటి ద్వారా రూ.1,313 కోట్లు అందించడం జరిగింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర పథకాలను వారికి వర్తింప చేస్తోంది.

e) ఈ ఏడాది నుంచి అంగన్ వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత భీమాను కూడా వర్తింప చేస్తోంది. ప్రమాద బీమాగా రూ. 2 లక్షల వరకూ చెల్లించడం జరుగుతోంది.

f) గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోమ్ రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పనిభారం తగ్గడమే కాకుండా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే మార్గాలను అంగన్వాడీలకు అందిస్తూ 2023 నుంచి ప్రభుత్వం డ్రై రేషన్ అందిస్తోంది.

3. జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), 2013 నిర్దేశించిన విధంగా ప్రతి గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లికి బిడ్డ పుట్టిన 6 నెలల వరకు మరియు 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు (పౌష్టికాహార లోపంతో బాధపడే వారితో సహా) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి. వారు సంబంధిత అంగన్ వాడీ సెంటర్లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు అనుబంధ పోషకాహారం అన్ని పని వేళల్లో అందించాలి. ICDS పథకం కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్, క్యాలెండర్ సంవత్సరంలో కనీసం 300 లేదా నెలలో సగటున 25 రోజులు అనగా, ఉదయం స్నాక్స్, వేడిగా వండిన భోజనం (HCM) మరియు టేక్ హోమ్ రేషన్‌గా అందించాలి.

4. సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం యొక్క లక్ష్యాలు గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు, 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు మరియు 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు నిరంతరం పోషకాహార సహాయాన్ని అందజేయడం. AWW లు & AWHలు సమ్మె వలన వారి విధులకు హాజరు కాకపోవడం వలన, పోషకాహార కిట్‌లు, THR మరియు గుడ్డు & పాలు మరియు పంపిణీ చేయబడిన సప్లిమెంటరీ న్యూట్రిషన్ (SNP) లబ్ధిదారులకు లేదు. అంతేకాకుండా, గర్భిణీలు & పాలిచ్చే తల్లులు & 06 నెలలు - 6 సంవత్సరాల పిల్లలను ఆరోగ్య శాఖ ANM సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ పెరుగుదల/ ఆరోగ్య పారామితులపై పర్యవేక్షణ జరగటం లేదు.

5. పైన పేర్కొన్న అంశాలదృష్ట్యా, అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సేవలకు ఆటంకం ఏర్పడినందున, గర్భిణులు & పాలిచ్చే స్త్రీలు, చిన్న పిల్లలు మరియు అణగారిన వర్గాల యొక్క ప్రయోజనాల దృష్ట్యా అంగన్ వాడీ కేంద్రాలలో అందించే సేవలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరియు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం జరిగింది.

6. పిల్లలకు మరియు గర్భవతులు మరియు బాలింతలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోషకాహారాన్ని అందించటానికి, అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించటానికి, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడానికి, జివిడబ్ల్యువి & వివిఎస్‌డబ్ల్యుఎస్ (లేదా) సెర్ప్ (లేదా) రెండింటి కలయికతో కూడిన గ్రామ సంస్థల యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాము.

7. కాబినెట్ మంత్రుల గ్రూపు, చీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలుదఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవలసినదిగా విజ్ఞప్తి చేసియున్నారు. డిపార్టుమెంటు కూడా అందరు అంగన్ వాడీ కార్యకర్తలకు బల్క్ ఎస్.ఎం.ఎస్‌ను పంపించి సమ్మెను విరమించుకోవలసినదిగా కోరటం జరిగింది. ప్రస్తుతం 53.7% గర్భవతులు రక్తహీనతతో వున్నారు, 29.6%, 5 సంవత్సరాలలోపు పిల్లలు బరువు తక్కువగా వున్నారు. 16.1% 5 సంవత్సరాలలోపు పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకుండా (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్-5 ప్రకారంగా) వున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన వీరి ఆరోగ్య మరియు పోషణ స్థాయిలు దిగజారి హైరిస్క్ గ్రూప్లో పడే ప్రమాదం వున్నది. మీరు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీనిని పురస్కరించుకొని ప్రభుత్వం వారు మీ సంఘము యొక్క సభ్యులతో పలుసార్లు చర్చించి ముఖ్యమైన కోరికలకు ప్రాథమికముగా ఆమోదం తెలిపియున్నారు. ప్రభుత్వం మిగిలిన కోరికలను పరిష్కరించుటకు ప్రయత్నములు చేయుచున్నప్పటికీ, మీరు మీ యొక్క ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావటం లేదు. కావున జిల్లా పరిపాలన అధికారిగా మీకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీ న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తుంచుకోవలసినదిగా అభ్యర్థిస్తున్నాము. అలాగే ఈ సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులను పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవలని మనవి చేస్తున్నాం. గర్భవతులు మరియు పిల్లల ఆరోగ్య మరియు పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము మరియు జనవరి 5, 2024 లోగా విధులకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఒకవేళ సమ్మె విరమింపచెయ్యని యెడల ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేయటమైనది.

ఇట్లు
కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్, నెల్లూరు



సీతారామపురంలో పింఛన్ నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



నెల్లూరులో పెన్షన్ అందుకున్న లబ్ధిదారులు

పింఛన్ల పండగ

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పింఛన్ లబ్ధిదారులకు సంక్రాంతి ముందే వచ్చింది. పెరిగిన పింఛన్ నగదు పంపిణీ బుధవారం జిల్లా వ్యాప్తంగా పండగ వాతావరణంలో మొదలైంది. ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు అవ్వాతాతలకు వైఎస్సార్ పెన్షన్ కానుకను అందజేశారు. ఇంకా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందించి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/సాక్షి, నెట్‌వర్క్



నెల్లూరులో కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు తదితరులు



నెల్లూరు సంతపేట ఈద్గా ప్రాంతంలో షేక్ చోటీజాన్‌కు వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కృష్ణకుమార్

పేద పిల్లలు బాగుండాలనేదే జగన్ కోరిక



విద్యార్థినికి ట్యాబ్ అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: 'పేద పిల్లలు బాగా చదువుకుని బాగుండాలనేదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరిక. ఇందులో భాగంగానే వారి కోసం అనేక పథకాలు ప్రారంభించారు.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కొడవలూరు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్యాబ్‌లు ఉపయోగించుకుని పేదింటి బిడ్డలు అభివృద్ధి చెందడం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, రామోజీరావు, వేమూరి రాధాకృష్ణకు ఇష్టం లేదన్నారు. పేద పిల్లలు ట్యాబ్‌లలో నీలి చిత్రాలు చూస్తున్నారంటూ ఎల్లో మీడియాలో సిగ్గులేని రాతలు రాస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ నలుగురూ తమ కుటుంబాల్లోని పిల్లలను తెలుగు మీడియంలో చదివించడంతోపాటు ట్యాబ్‌లు వినియోగించకుండా చేసి ఆ తర్వాతే ఇతరులకు సూచించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేసిన ఏకైక సీఎం దేశంలో జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. 14 సంవత్సరాలు సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదని ఎమ్మెల్యే గుర్తుచేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఎంపీపీ జ్యోతి, సర్పంచ్ బి.సుప్రియ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సొసైటీ చైర్మన్ డి.శివకుమార్, నాయకులు ఎ.మోహన్‌కృష్ణ, ఐ.సునీల్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసులు, ఎం.రంగారెడ్డి, ఆర్.రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

- వ్యక్తి దుర్మరణం

కొడవలూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని నాయుడుపాళెం సమీపంలో హైవేపై మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. 30 నుంచి 35 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వ్యక్తిని నాయుడుపాళెం వద్ద నెల్లూరు వైపు వెళ్లే రోడ్డుపై వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హైవే మొబైల్ పోలీసులు అందించిన సమాచారం మేరకు ఎస్సై కె.వీరప్రతాప్ బుధవారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో ఉన్న అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. ఉదయం జరిగిన ఒకటో సెమిస్టర్ పరీక్షకు 823 మంది విద్యార్థులకు గానూ 716 మంది హాజరయ్యారన్నారు. నాయుడుపేటలో ఇద్దరు, నెల్లూరులో ముగ్గురిని డిబార్ చేశారన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షకు మొత్తం 10,320 మందికి గానూ 9,550 మంది హాజరయ్యారన్నారు. నెల్లూరు నగరంలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని తెలిపారు.

రోడ్డు దాటుతుండగా..

- బైక్ ఢీకొని దివ్యాంగుడి మృతి



రమణయ్య మృతదేహం

నెల్లూరు(క్రైమ్): రోడ్డు దాటుతున్న దివ్యాంగుడిని మోటార్ బైక్ వేగంగా ఢీకొనడంతో మృతిచెందిన ఘటన బుజబుజ నెల్లూరు జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. దివ్యాంగుడైన రమణయ్య(70) బుజబుజనెల్లూరు పరిసర ప్రాంతాల్లో చిత్తుకాగితాలు ఏరుకుంటూ స్థానికంగా దుకాణాల వద్ద నిద్రించేవాడు. ఆయన బుధవారం ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి నెల్లూరు వైపు వెళ్లే రోడ్డు దాటుతున్నాడు. ఈ సమయంలో గూడూరు వైపు నుంచి వస్తున్న బుల్లెట్ వేగంగా ఆయన్ను ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో రమణయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమణయ్య మృతిచెందాడు. సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.వేమారెడ్డి హాస్పిటల్‌కు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి పూర్తి వివరాలు తెలిసిన వారు సౌత్ ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

క్రీడా పోటీల్లో తలపడి.. ప్రతిభ చూపి..



పోటీలను తిలకిస్తున్న అధికారులు, సిబ్బంది



టగ్ ఆఫ్ వార్‌లో తలపడుతున్న పోలీసులు

- నేటితో స్పోర్ట్స్ మీట్ ముగింపు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని పోలీస్ కవాతు మైదానంలో జిల్లాస్థాయి పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ రెండో రోజు బుధవారం కోలాహలంగా జరిగింది. పోలీస్ అధికారులు, సిబ్బంది క్రీడా పోటీల్లో ఉత్సాహంగా తలపడి ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల ఐక్యతాభావం పెంపొందుతుందని చెప్పారు. విధి నిర్వహణలో ఒత్తిడికి గురికాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలన్నారు. రెట్టింపు ఉత్సాహంతో పాల్గొని ప్రతిభ చూపాలన్నారు. 100 మీటర్ల మహిళల పరుగు పందెం ఫైనల్స్, టగ్ ఆఫ్ వార్, క్రికెట్, డిస్కత్రో, వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, క్యారమ్ బోర్డు, షటిల్, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో విభాగాల్లో పోటీలు జరిగాయి. గురువారం స్పోర్ట్స్ మీట్ ముగియనుంది. కార్యక్రమంలో ఏఎస్పీలు, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్‌లు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

108లో సురక్షిత కాన్పు



శిశువును అప్పగిస్తున్న 108 సిబ్బంది

కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరి 108 అంబులెన్స్ సిబ్బంది బుధవారం గర్భిణికి సురక్షితంగా కాన్పు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కలిగిరి పంచాయతీ వెంకన్నపాళెం ఎస్సీ కాలనీకి చెందిన శాంతి గర్భిణి. ఆమెకు నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఆమెను ఆత్మకూరులోని వైద్యశాలకు తరలిస్తుండగా నొప్పులు అధికమయ్యాయి. దీంతో స్పందించిన ఈఎంటీ షేక్ మహమద్‌బాషా, పైలట్ నరేష్ డాక్టర్ల సూచనలు పాటిస్తూ కాన్పు చేశారు. శాంతి ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో చేర్చారు. సురక్షితంగా కాన్పు చేసిన 108 సిబ్బందిని పలువురు అభినందించారు.

ఈనెల 10న మెగా రక్తదాన శిబిరం

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



మాట్లాడుతున్న పెంచలయ్య

నెల్లూరు సిటీ: నెల్లూరులోని ఏసీఎస్ఆర్ స్టేడియంలో ఈనెల 10వ తేదీ మెగా రక్తదాన శిబిరం జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు. బ్లడ్ డొనేషన్ క్యాంప్‌లు నిర్వహించే సంస్థలతో నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా అనేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉండే రోగులను కాపాడేందుకు జిల్లాలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. దాతలను మోటివేట్ చేసేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. 10వ తేదీన ఆత్మకూరు, కందుకూరు, కావలిలోనూ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డాక్టర్ ఎస్‌కే ఖాదర్‌వలి, డాక్టర్ బ్రిజిత, రమేష్, సుధీర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.29
సన్నవి : రూ.20
పండ్లు : రూ.7



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 112
లేయర్ (లైవ్) : 90
బ్రాయిలర్ చికెన్ : 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 224
లేయర్ చికెన్ : 153